# 43

# రూపాంతరము

## (17:1-13)

“యేసు పరిచర్యకు అదనపు ప్రతిస్పందన” అని మనము పేరు పెట్టుకొన్న సంఘటనల పరంపరను (అధ్యాయములు 14-17) 17వ అధ్యాయము ముగించుచున్నది. మత్తయి సువార్తికుడు, పరిశుద్ధాత్మ ప్రేరేపణ చేత, యేసును చుట్టుముట్టియుండిన జనసమూహములు ఆయనను ఎలా చూసారో, వారి దృష్టికోణము ననుసరించుచు ఆయన ఏమైయుండెనో, ఆయన ఏమేమి చేయుచుండెనో యను విషయములకు వారు ఎలా ప్రతిస్పందించారో మనముందుంచుచున్నాడు. అటు తరువాత, నాలుగవ సుదీర్ఘ ఉపదేశ భాగమును నివేదించుట ద్వారా, యేసు బోధనా పరిచర్య గూర్చి ప్రముఖంగా ప్రకటించుటకు మత్తయి వెనుదిరిగాడు (అధ్యాయము 18).

ఈ అధ్యాయం, క్రీస్తు మహిమ బయలుపర్చబడిన రూపాంతర ఘటనతో ప్రారంభమగుచున్నది (17:1-13). జరిగిన విషయానికి పేతురు తప్పుమార్గములో ప్రతిస్పందించుచు, యేసును మోషే మరియు ఏలీయాల ప్రక్కపక్కనే వారితోపాటు గౌరవింపవలెనని అతడు ఆశించాడు. దేవుడు తన కుమారుని ఆధిక్యమును ఆకాశము నుండి ఘోషించుట ద్వారా ఆ ఏర్పాటును కప్పివేసాడు. వారు యేసు మాటలను మాత్రమే ఆలకింపవలెనని, దేవుడు ముగ్గురు అపొస్తలులకు సెలవిచ్చిన ఆజ్ఞ నేటి క్రైస్తవ యుగమునకు సహితము సమస్త అధికారములను ఉపేక్షించు ఆజ్ఞగా నిలిచియుంటున్నది.

### కొండ మీద యేసు మహిమర్చబడుట (17:1-8)

**1ఆరు దినములైన తరువాత యేసు పేతురును యాకోబును అతని సహోదరుడైన
యోహానును వెంటబెట్టుకొని యెత్తయిన యొక కొండమీదికి ఏకాంతముగా పోయి వారి
యెదుట రూపాంతరము పొందెను. 2ఆయన ముఖము సూర్యునివలె ప్రకాశించెను;
ఆయన వస్త్రములు వెలుగువలె తెల్లని వాయెను. 3ఇదిగో మోషేయు ఏలీయాయు వారికి
కనబడి అయనతో మాటలాడుచుండిరి. 4అప్పుడు పేతురు-ప్రభువా, మనమిక్కడ ఉండుట
మంచిది; నీకిష్టమైతే ఇక్కడ నీకు ఒకటియు మోషేకు ఒకటియు ఏలీయాకు ఒకటియు
మూడు పర్ణశాలలు కట్టుదునని యేసుతో చెప్పెను. 5అతడు ఇంకను మాటలాడుచుండగా
ఇదిగో ప్రకాశమానమైన యొక మేఘము వారిని కమ్ముకొనెను; ఇదిగో ఈయన నా
ప్రియకుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడని
యొక శబ్దము ఆ మేఘములో నుండి పుట్టెను. 6శిష్యులు ఈ మాట విని బోర్లబడి మిక్కిలి
భయపడగా 7యేసు వారియొద్దకు వచ్చి వారిని ముట్టి-లెండి, భయపడకుడని చెప్పెను.
8వారు కన్నులెత్తి చూడగా, యేసు తప్ప మరి ఎవరును వారికి కనబడలేదు.**

పర్వత శిఖరములు అనేక ప్రత్యక్షతలకును, విడుదలలకును అనువైన ఏర్పాట్లను సమకూర్చినవి. పాత నిబంధనలో, నోవహు మందసముతోపాటు, జలప్రళయము తరువాత అరారాతు కొండల మీద నిలిచెను (ఆదికాండము 8:4). మోషే, సీనాయి పర్వతముపై ధర్మశాస్త్రమును పొందాడు (నిర్గమకాండము 24:1, 16; 34:1–5;) మరియు నెబో పర్వతము మీదనుండి వాగ్దాన దేశమును చూసాడు (ద్వితీయోపదేశ కాండము 34:1–4). ఏలీయా, కర్మెలు పర్వతముపై బయలు ప్రవక్తలను నాటకీయముగా ఎదుర్కొనాడు (1 రాజులు 18:19–40).

క్రొత్త నిబంధనలో, పర్వతముల మీద పొందబడిన అనుభవములలో అత్యధిక శాతం, యేసు తానే అనుభవించాడు. గ్రంథస్థం చేయబడిన అతి గొప్ప ప్రసంగము కపెర్నహూముకు సమీపమున నుండిన ఒక కొండ మీద నుండి చేయబడినది (మత్తయి 5–7). గలిలయలోని పేరు పేర్కొనబడని పర్వత శిఖరము మీదనుండి, యేసు తన అపొస్తలులకు మహా ఆదేశమును జారీ చేసాడు (మత్తయి 28:7, 10, 16-20). ఒలీవల కొండ మీదనుండి, యేసు పరలోకమందున్న తన తండ్రి యొద్దకు ఆరోహణుడయ్యాడు (అపొస్తలుల కార్యములు 1:4–12). మనము ప్రస్తుతము అధ్యయనము చేయుచున్న ఈ వాక్యభాగములో అనగా, మత్తయి 17:1–8లో, యేసు జీవితములో జరగిన అత్యంత ప్రాముఖ్యమైన సంఘటనలలో ఒకటి “యెత్తయిన ఒక కొండ మీద” సంభవించినది.

యేసు రూపాంతరముపొందుట, అనగా ఆయనకు అత్యంత సన్నిహితముగా నుండిన అపొస్తలులతో (పేతురు, యాకోబు, మరియు యోహాను) పంచుకొనబడిన సంఘటన, చాలా ప్రాముఖ్యమైన సమయంలో సంభవించినది. రానైయుండిన రాజ్యమును గూర్చిన వాగ్దానము తరువాత (16:28), అది ఈ ముగ్గురు సాక్షులకు ఆ రాజు మహిమ యొక్క పూర్వానందానుభవమును కలుగజేసినది. ఇంకా, యేసు యొక్క కుమారత్వము గూర్చి తండ్రి నోటనుండి వచ్చిన ప్రకటన, పేతురు ఒప్పుకోలులో నుండిన సత్యమును (16:16) రూఢిపర్చినది. ఇంతేగాక, ఆసన్నమగుచుండిన ఆయన మరణము (16:21) మరియు శిష్యులే అనుభవింపనై యుండిన శ్రమల (16:24–26) దృష్ట్యా, యేసు మహిమను కళ్లారా చూడగలుగుట నిస్సందేహముగా వారికి అదనపు అభయము నిచ్చినది. దేవుడు ఏర్పరచుకొనిన మెస్సీయగా సిలువవేయబడుట వలన శ్రమలనుభవించనై యుండినవాని వాస్తవమైన స్వభావము మరియు దైవికమైన మహిమ రూపాంతరము ద్వారా వెల్లడిచేయబడినది.[1]

**వచనము 1.** మత్తయి మరియు మార్కు దీనిని **ఆరు దినములైన తరువాత** ఆయన ఆరోహణమైన ఒక కొండకు **యేసు** వెళ్లినప్పుడు జరిగిన వృత్తాంతముగా గ్రంథస్థం చేసారు (మార్కు 9:2) ఏదిఏమైనా, లూకా, ఇదే సంఘటన, ఇంతకు ముందు జరిగిన సంఘటనలకు “రమారమి యెనిమిది దినములైన తరువాత” జరిగినట్లు వ్రాయుచున్నాడు (లూకా 9:28). ఈ వృత్తాంతములలో ఎటువంటి విరుద్ధోక్తియైనను లేదని రుజువగుచున్నది. మొదటిగా, లూకా “రమారమి” (*hōsei*) లేక “దాదాపుగా” (NIV) అను పదమును ఉపయోగించాడు, గనుక ఈయన సుస్పష్టంగా చెప్పుటకు సిద్ధంగాలేడని ఈ పదము చూపించుచున్నది. రెండవదిగా, లూకా బహుశా యూదులు కాలమును లెక్కించుచుండిన పద్ధతిని ఉపయోగించి యుండవచ్చును; ఆ పద్ధతి ప్రకారము దినములోని ఒక భాగము సహితము సంపూర్తి

దినముగా లెక్కింపబడినది. ఇతర సమదృక్పథ సువార్తల రచయితలు ఆసన్నమగుచుండిన ఆయన మరణము గూర్చి ప్రభువు అపొస్తలులకు బయలుపరచిన దినమును లేదా ఆయన వాస్తవముగా రూపాంతరము పొందిన దినమును లెక్కించలేదు, కానీ మధ్యలో నుండిన ఆరు దినములను మాత్రమే లెక్కించారు.

యేసుతో అత్యంత సన్నిహితముగా మెలగుచుండిన **పేతురు, యాకోబు,** మరియు **యోహాను** ఉండిరి గనుక వారు ("అత్యంత రమ్యమైన సమూహమని") అత్యంతరమైన సమూహమని వర్ణింపబడిరి. అంతకు మునుపు, చనిపోయిన యాయిరు కుమార్తెను ఆయన లేపినప్పుడు ఈ ముగ్గురు అపొస్తలులు మాత్రమే ఉండిరి (లూకా 8:41, 42, 51-56). అటు తరువాత, ఆనాటి రాత్రి ఆయన గొప్ప వేదనను అనుభవించుచుండిన సమయంలో వారు గెత్సేమనే తోటలో ఆయనతో కూడ ఉండిరి (26:36-45). ఆయన వారితో కలిగియుండిన ప్రత్యేకమైన సన్నిహితమునుబట్టి, ఈ సందర్భములో ఆయన పొందనై యుండిన మహిమను వారు కళ్లారా చూడవలెనని ఆయన ఈ ముగ్గురిని ఏర్పరచుకొన్నాడు.

ఇంత మహిమా ప్రభావముగల ఈ సన్నివేశమునకు సాక్షులుగా నిలుచునట్లు ఈ ముగ్గురు అపొస్తలులు మాత్రమే ఎందుకు అనుమతింపబడిరి? వీరు మాత్రమే ఆయనను ఎదుర్కొననైయుండిన సంకటావస్థను అర్థంచేసికొని ఆయనయెడల సానుభూతి ప్రదర్శింపగల సామర్థ్యముగలవారనియా? ఇది నిజము కాదని అటుతరువాతి ప్రకటనలు బయలు పర్చుచున్నవి (లూకా 9:33). లేక, ఆయన ఏర్పరచుకొనిన శిష్యులలో మొట్టమొదటివారై యుండినందుకా? మొదలగు ఈ ప్రశ్నలకు సమాధానమిచ్చుటకు, మనము మరొక ప్రశ్న వేసుకొనవలెను: అలాగైతే, అంద్రెయ,ఫిలిప్పు, మరియు నతనయేలు సంగతేమిటి (యోహాను 1:35-51)?

పైన పేర్కొనబడిన హేతువుల కంటె ఎక్కువ సహేతుకమైనదని అనిపించు సలహా ఏమనగా, గంభీరమైన సన్నివేశమును గమనించువారి సంఖ్యను చిన్నదిగా ఉంచుకొనుట ద్వారా, ఈ సంఘటన సంభవించుటకు సరైన సమయము వచ్చునంత వరకు కూడ దీని గూర్చి ఇతరులకు తెలియజెప్పబడుటను యేసు సులభముగా నిరోధించగలడు (17:9 చూడు). "ఆయన మహాత్మ్యమును మేము కన్నులార చూచినవారమని" చెప్పుచు, ఈ సంఘటన గూర్చి పేతురు అటుతరువాత రచించాడు (2 పేతురు 1:17). యోహాను, "... ఆయన మహిమను కనుగొంటిమి" అని చెప్పినప్పుడు (యోహాను 1:14 చూడు) అతని మనస్సులో కూడ రూపాంతర సంఘటన ఉండియుండును. ఆయనతో కూడ యేసు ముగ్గురు అపొస్తలులను తీసికొని వెళ్లడను వాస్తవము, ఏదైన ఒక విషయము "ఇద్దరు లేదా ముగ్గురు సాక్షుల" ఆధారంగానే నిశ్చయపర్చుకొనబడవలెనను బైబిలు సంబంధమైన అవసరతను కూడ తీర్చుచుచున్నది (ద్వితీయోపదేశకాండము 17:5, 6; 19:15; మత్తయి 18:16; 2 కొరింథీయులకు 13:1; 1 తిమోతి 5:19; హెబ్రీయులకు 10:28).

మత్తయి మనకు తెలియజెప్పుచున్నదాని ప్రకారం, యేసు ఈ ముగ్గురు అపొస్తలులను **వెంటబెట్టుకొని యెత్తయిన** ఒక **కొండమీదికి** ఏకాంతముగా **వెళ్లాడు**. ఏదిఏమైనా, సువార్తల రచయితలలో ఏ ఒక్కరైనను సరైన చోటును పేర్కొనలేదు. ఈ సంఘటనను పేతురు అటు తరువాత తన పత్రికలో పేర్కొనినప్పుడు "ఆ పరిశుద్ధ పర్వతము" అని మాత్రమే వ్రాయుచున్నాడు (2 పేతురు 1:18). రూపాంతర కొండ స్థలమును ఖచ్చితముగా గుర్తించుట సాధ్యము కాదు.

ఆ కొండ నజరేతునకు నైరుతి దిశగా ఆరు మైళ్ల దూరములో నుండిన, తాబోరు పర్వతమని సాంప్రదాయము చెప్పుచున్నది. ఈ పర్వతము యేసు అచ్చట ఉండినాడని భౌగోళికముగా తెలియుచున్న స్థలము, ఫిలిప్పుదైన కైసరయ (16:13) నుండి మూడు దినముల ప్రయాణమంత దూరములో ఉండియుండును. ఏదిఏమైనా, తాబోరు పర్వతము ఎత్తు 1,800 అడుగులు మాత్రమే, ఈ వివరము "యెత్తయిన యొక కొండ" అని మత్తయి వ్రాయుచున్న వివరమునకు సరిగా సరిపోదు. ఇంక, క్రీస్తు కాలములో కార్యనిర్వహణలో నున్న రోమా సైనికుడు ఉండు చోటు తాబోరు కొండపై నుండినదని తెలియుచున్నది,[2] గనుక ఈ పరిస్థితిలో యేసు ఆ కొండ మీదికి వెళ్లుటకు గల అవకాశములు తక్కువే.

హెర్మోను పర్వతము: ఫిలిప్పుదైన కైసరయకు ఈశాన్యమున కేవలము పదునాలుగు మైళ్ల దూరములో మంచు మయమైన పర్వత శిఖరములు 9,000 అడుగుల ఎత్తుండినది, రూపాంతర సంఘటన జరుగుటకు ఎక్కువ అవకాశములున్న స్థలమై యున్నది. ఏదిఏమైనా, ఉత్తరమున అన్యజనాంగముల ప్రజానీకం ప్రబలముగా ప్రబలియుండిన స్థలములో, యాదులైన శాస్త్రులు (మార్కు 9:14) ఉండియుందురా అని కొందరు ప్రశ్నించుదురు.

ఇంకా, యేసు రూపాంతరము పొందిన పర్వతము, గలిలయ సముద్రమునకు వాయవ్య దిశగా ఎనిమిది మైళ్ల దూరములో నున్న మెయ్‌రోన్ పర్వతమనునది ఆస్థలమునకు మరొక సలహాయైయున్నది. ఈ పర్వతము 4,000 అడుగుల ఎత్తుండినది, సరైన పాలస్తీనా దేశంలో అదే అత్యంత ఎత్తయిన పర్వతము. యేసు మరియు ఆయన శిష్యులు ఫిలప్పుదైన కైసరయ (16:13) నుండి కపెర్నహూముకు (17:24) వెళ్లుచుండిన మార్గములో మెయ్‌రోన్ పర్వతమునకు సునాయాసముగా పయనించి వెళ్లియుందురు.

**వచనము 2.** యేసు ప్రార్థన చేయుటకు కొండ యెక్కాడు (లూకా 9:28). ఆయన ప్రార్థించుచుండగా, తన శిష్యుల యెదుట **ఆయన రూపాంతరము పొందెను**. "రూపాంతరము పొందెను"[3] అని అర్థమిచ్చుచున్న గ్రీకు పదము (*metamorphoō*). "Metamorphosis" అను ఆంగ్ల పదమునకు ఆలంబనముగా నిలుచుచున్నది. ఇదే పదము రోమీయులకు 12:2లోను, 2 కొరింథీయులకు 3:18లోను "రూపాంతరము పొందుడి" అని అనువదింపబడినది. *Metamorphoō*, లోపల నుండి, ఆంతర్యములో నుండి, వెలుపలకు వచ్చు మార్పును సూచిస్తుంది. మోషే విషయంలో జరిగినట్లుగా (నిర్గమకాండము 34:29–35), యేసు రూపాంతరము పొందినప్పుడు ఆయన మహిమ ప్రతిబింబించలేదు, కానీ ఆయన ఆంతర్యములో నుండి అది వెలుపలికి విరజిమ్మినది (కొలొస్సయులకు 1:15; హెబ్రీయులకు 1:3, 4 చూడు). ఇది "యేసు క్రీస్తు నరావతారమెత్తక మునుపటి మహిమ యొక్క జ్ఞాపికగాను (యోహాను 1:14; 17:5; ఫిలిప్పీయులకు 2:6, 7) మరియు ఆయన రాకడ మహాత్మ్యము యొక్క పూర్వప్రదర్శనగాను (2 పేతురు 1:16–18; ప్రకటన 1:16)," ఆయన "దేవుడుగా కలిగియుండిన దైవికమైన స్వభావమును మరియు మహిమను"[4] బయలుపర్చుచు ఒక రూపాంతరీకరణమై యున్నదని మైఖేల్ జే. విల్కిన్స్ వర్ణించాడు.

**ఆయన ముఖము సూర్యుని వలె ప్రకాశించెను, ఆయన వస్త్రములు వెలుగువలె తెల్లనివాయెను.** సువార్తీకుడైన లూకా ప్రకారము, "ఆయన ముఖ రూపము మారెను, ఆయన వస్త్రములు తెల్లనివై ధగధగ మెరిసెను" (లూకా 9:29). "ఆయన వస్త్రములు ప్రకాశమానమైనవియు మిగుల తెల్లనివియు ఆయెను; లోకమందు ఏ చాకలియును అంత

తెల్లగా చలువచేయలేదని" మార్కు చేయుచున్న వర్ణనలో చేర్చబడియున్నది (మార్కు 9:3). ఈ ప్రతిపాదనలు ప్రభువు యొక్క పైరూపములో కలిగిన నాటకీయమైన మార్పును నొక్కివక్కాణించుచు ఆయన యొక్క పరలోక మూలమును బయలుపర్చుచున్నవి (దానియేలు 7:9; మత్తయి 28:3; అపొస్తలుల కార్యములు 1:10; ప్రకటన 1:16; 4:4; 7:13; 10:1 చూడు).

**వచనము 3.** లూకా వ్రాసిన సువార్తలో బయలుపర్చబడినట్లుగా, ఈ సంఘటన సంభవించుచుండిన సమయంలో దాదాపుగా ఎక్కువ సమయం ఈ ముగ్గురు అపొస్తలులు, నమ్మకముగా వెంబడించుచున్నారని నమ్మినవారు, యేసు జీవితంలోచోటుచేసుకొన్న రెండు అత్యంత ప్రాముఖ్యమైన సందర్భములలోను మెలకువగా ఉండలేకపోయారు, వారు నిద్రించుచుండిరి. ఇది విచారకరముగ ఒక వక్రోక్తియై యున్నది: యేసు రూపాంతరముచెందుట మరియు ఆయన గెత్సేమనే తోటలో ప్రార్థన చేయుట (లూకా 9:30–33; మత్తయి 26:36–45). ఈ సమయంలో, వారు అకస్మాత్తుగా మేల్కొన్నప్పుడు, **మోషే మరియు ఏలీయా** యేసుతో మాటలాడుట చూచి వారు విస్మయమొందారు. అయితే శిష్యులు వారిని ఎలా గుర్తించారో వాక్యభాగము సూచించుట లేదు; వారి సంభాషణా తీరునుబట్టి గుర్తించియుందురు.

ఈ సందర్భములో మోషే మరియు ఏలీయా యేసుకు అగుపించుట సముచితమైన సంగతైయున్నది. మోషే, ఇశ్రాయేలీయులకు గొప్ప ధర్మశాస్త్రము నొసగినవాడై యుండెను (యెహోషువా 1:17 చూడు). కానీ "వారి సహోదరులలోనుండి నీవంటి ప్రవక్తను వారికొరకు పుట్టించెదను, అతని నోట నా మాటలనుంచుదును, నేను అతని కాజ్ఞాపించునది యావత్తును అతడు వారితో చెప్పెనని" దేవుడు సెలవిచ్చిన మాటలు మోషేయే రచించాడు (ద్వితీయోపదేశ కాండము 18:18). మోషే దేవుని ఆజ్ఞానుసారంగా, నెబో పర్వతముపైకి వెళ్లి, "యెహోవా మాట చొప్పున మోయాబు దేశములో మృతినొందెను." అప్పుడు దేవుడు "బెత్పయోరు యెదుట మోయాబు దేశములో నున్న లోయలో అతనిని పాతిపెట్టెను; అతని సమాధి యెక్కడ నున్నదో నేటివరకు ఎవరికి తెలియదు" (ద్వితీయోపదేశ కాండము 34:5, 6).

దేవుని అత్యంత గొప్ప ప్రవక్తలలో ఏలీయా ఒకడు. ఉత్తరమున నుండిన ఇశ్రాయేలు గోత్రముల ప్రజలను పరిపాలించిన రాజైన అహాబు కాలంలో బయలు దేవతారాధనను ఫలదాయకముగా ప్రతిఘటించినందుకు ఈయన సుప్రసిద్ధిగాంచాడు (1 రాజులు 16:29–19:18). మరణించని ఇద్దరు వ్యక్తులలో ఏలీయా ఒకడు.[5] దానికి మారుగా ఈయన సుడిగాలి చేత ఆకాశములకు అగ్ని రథముపై కొనిపోబడెను (2 రాజులు 2:11, 12).

మోషే మరియు ఏలీయా సీనాయి పర్వతముపై దేవుని ప్రత్యక్షతను పొందారు (నిర్గమకాండము 24:12–18; 34:1–9; 1 రాజులు 19:8–12). పాత నిబంధన ముగింపు పలుకులలో ఈ ఇరువురు కూడ పేర్కొనబడి యున్నారు: "... నేను నా సేవకుడైన మోషేకు ఆజ్ఞాపించిన ధర్మశాస్త్రమును దాని కట్టడలను విధులను జ్ఞాపకము చేసికొనుడి. ... నేను ప్రవక్తయగు ఏలీయాను మీ యొద్దకు పంపుదును" (మలాకీ 4:4, 5). స్పష్టముగా, మోషే మరియు ఏలీయా కలిసి తిరిగి వచ్చెదరని యూదులు ఎదురుచూసారు.[6] ఈ ఇరువురును చారిత్ర్మాకమైన రెండు పాత నిబంధన చరిత్ర కాలములకు ప్రధాన ప్రతినిధులై యుండిరి.

వారు యేసుతో కూడ అగుపించుట ధర్మశాస్త్రము మరియు ప్రవక్తల ముగింపు కాలము సమీపములోనున్నదని సూచించినది (5:17, 18; లూకా 24:44; రోమీయులకు 10:4; ఎఫెసీయులకు 2:14–16 చూడు).

ఈ యిద్దరు గొప్ప వ్యక్తులు యేసుతో **మాటలాడుచుండిరి.** వారి సంభాణలోని సంగతులను మత్తయి సువార్త పేర్కొనకపోగా, వారు "ఆయన యెరూషలేములో నెరవేర్చబోవు నిర్గమమును గూర్చి మాటలాడుచుండిరని" లూకా 9:31 చెప్పుచున్నది. యేసు సిలువ మరణము నొందనైయుండెను గనుక ఆయనకు తోడ్పడుచు ఆయనను ప్రోత్సాహించవలెననునది వారు యేసుకు అగుపించుటకు గల ఒక హేతువై యున్నది. "వెళ్లిపోవుట" (*exodos*) అని అనువదించబడిన పదము హెబ్రీయులకు 11:22లో "నిర్గమనము" (exodus) అనియు, 2 పేతురు 1:15లో "మృతిపొందుట" అనియు (KJV) అనువదించబడినది.

**వచనము 4.** ఈ ముగ్గురు శిష్యులు మేల్కొనిన పిదప **పేతురు, ప్రభువా, మనమిక్కడ ఉండుట మంచిదని యేసుతో అన్నాడు** పేతురు తన అలవాటు ప్రకారంగా, శిష్యులందరి పక్షంగా–ఈ సమయంలో యాకోబు మరియు యోహానుల పక్షంగా–మాటలాడాడు. వారు ఈ శుభ ఘట్టము సందర్భములో యేసుతో కూడ ఉండి కళ్లారా చూచుటకు ప్రత్యేకార్హతగలవారయ్యారని అతడు గుర్తించాడు. మిగిలిన తొమ్మండుగురు శిష్యులు కొండ మీదికి ఆహ్వానింపబడని కారణంగా కొండ దిగువన లోయలో ఉండిరి.

**నీకిష్టమైతే, ఇక్కడ నీకు ఒకటియు, మోషేకు ఒకటియు, ఏలియాకు ఒకటియు, మూడు పర్ణశాలలు కట్టుదునంటూ** పేతురు తన మాటలు కొనసాగించాడు. పేతురు "పర్ణశాలలు" అని పేరొన్నప్పుడు అతని అర్థమేమైయుండును? ఈ వచనములోని గ్రీకు పదము (*skēnē*) "గుడారములు" (RSV) అనియు, "ఆశ్రయపురములు" (NIV) అనియు, "పుణ్య క్షేత్రములు" (NLT) అని కూడ అనువదింపబడినది.

"గూడారములు." పర్ణశాలల పండుగ లేదా, గుడారముల పండుగ సమయంలో, వారి అరణ్యములో చేసిన నలుబది సంవత్సరముల తాత్కాలిక ప్రయాణమును, వారు డేరాలలో బసచేసిన విషయమును గూర్చి (లేవీయకాండము 23:33–44) యూదులు స్మారకోత్సవము జరుపుకొన్నారు. పండుగ విందులో పాల్గొనిన ప్రతి ఒక్క కుటుంబము ఒక గుడారము కట్టుకొని అందులో ఈ వారము రోజులు బసచేసినది. గుడారముల పండుగ తిస్రీ మాసములో జరుపుకొనబడినది. పేతురు మూడు పర్ణశాలలు నిర్మించదలచింది ఆనాటి పర్ణసాలల పండుగను స్మారకోత్సవముగా చేసికొనుటకేనా? అలాగైతే, యేసు తిస్రీ (అక్టోబర్) మాసములో, పస్కా పండుగ మరియు యేసు సిలువవేయబడుటకు ఆరు మాసముల ముందు, రూపాంతరము పొందాడని అతడు చేపట్టదలచిన చర్య సూచించుచున్నది. ఏదిఏమైనా, పన్ను వసూలుచేయబడుట గూర్చి ఇదే అధ్యాయం ముగింపులో వ్రాయబడియున్న విషయము రూపంతర సంఘటన సంవత్సరములోని ఈ సమయంలో, తిస్రీ మాసములో, జరిగినదనుటను సమర్థించుటలేదు (17:24పై గల వ్యాఖ్యానము చూడు).

"ఆశ్రయములు." మోషే మరియు ఏలీయా యేసుతో కూడ ఉండినందునుబట్టి (లూకా 9:33), పేతురు బహుశా ఆనాటి రాత్రి అచ్చటనే గడుపగలుగునట్లు కొండ మీద అందుబాటులో నుండిన కొమ్మలు మరియు ఆకులు తీసికొని వచ్చి తాత్కాలిక

గుడారములను నిర్మించుట గూర్చి ఆలోచించి యుండవచ్చును. ఒకవేళ ఇదే అతని ప్రతిపాదన అర్థమైయున్నట్లయితే, అది అతిథ్యమిచ్చుట గూర్చిన ఆలోచనయే. వారు కొండ మీదనే యింకా కొంచెము ఎక్కువ కాలముండి మోషే మరియు ఏలీయాల బోధల వలని ప్రయోజనమును పొందగోరి యుండును.

"పుణ్య క్షేత్రములు." గుడారము, (దేవుడైన యెహోవా మరియు మోషే) "కలిసికొను డేరా" అని కూడ పిలువబడిన చోటు, ఇశ్రాయేలు ప్రజలు అరణ్యములో దేవుని ఆరాధించిన స్థలమై యుండినది (నిర్గమకాండము 25:1–27:21). అది దేవుని మన్నన మరియు మహిమ నిమిత్తమే నిర్మింపబడినది. అదే విధముగా బహుశా యేసును, మోషేను, మరియు ఏలీయాను గౌరవించుటకు మూడు పుణ్య క్షేత్రములను నిర్మింపవలెనని పేతురు ఆశించియుండును. ముగ్గురు కూడ ఏదో ఒక విధమైన మహిమతో కూడిన స్థితిలో ఉండినందువలన (లూకా 9:32). పేతురు వారినందరిని సమానులుగా పరిగణించాడు గనుక ప్రతి ఒక్కరు ఒకే విధంగ గౌరవింపబడవలెనని చెప్పుచుండెను.

పేతురు ప్రోత్సాహించుచుండిన ప్రేరకము ఏదైనప్పటికిని, అతని మనవి అసలు విషయంలో తప్పిపోయింది. "తాను చెప్పినది తానెరుగకయే చెప్పెనని" లూకా వ్రాస్తున్నాడు (లూకా 9:33). వారు "మిగుల భయపడిరి" గనుక "తాను చెప్పవలసినదేమో అతనికి తెలియలేదని" మార్కు వ్రాస్తున్నాడు (మార్కు 9:6). వాస్తవముగా ఆలోచనలేకుండా మాట లాడునంతగా పేతురు గంభీరమైన ఆ గడియల భావోద్రేకములలో నిమగ్నమైపోయి యుండెను. యథార్థమైన భావోద్రేకములు సుస్థాపితమైనవే, కానీ అవి వాని సహేతుకములను అతిక్రమించకుండునట్లు ఒకడు వాటిని అదుపుచేసుకొనవలెను.

**వచనము 5.** పేతురు మాటలాడుచుండగా అంతరాయము కలిగించబడినరని **అతడు ఇంకను మాటలాడుచుండగా** అను పదజాలము సూచించుచున్నది. దేవుడు మాట లాడినప్పుడు, అదొక భక్తిసంభ్రమమును గొలుపు దృశ్యమై యుండినది: **ప్రకాశమానమైన యొక మేఘము వారిని కమ్ముకొనెను**. 'మేఘము' పరిశుద్ధ బైబిల్‌లో ప్రయోగింపబడనప్పటికిని, మేఘమును గూర్చిన దృగ్గోచర విషయము, అనగా సాధారణంగ తేజోవిరాజితమైన వెలుగుమయమైనదియు, కొన్ని పర్యాయములు పొగతో కూడినదియునైన దృశ్యము, అటు తరువాత యూదులైన విద్వాంసుల చేత "షెకినా" అని సంబోధింపబడినది. మేఘమును గూర్చిన ఈ దృగ్విషయము ఎల్లప్పుడు దేవుని సన్నిధి ప్రసన్నతకు ప్రతినిధిగా నిలిచినది. ఒక అర్థంలో, పేతురు ప్రతిపాదన ప్రకారముకొమ్మలు మరియు ఆకులతోకట్టుకొనిన ఆశ్రయము కంటె మేఘము ఒక అతిగొప్పదైన మరియు ఎంతో మహిమాన్వితమునైన ఆచ్ఛాదనముగా పరిగణింపబడవచ్చును.[8] క్రైస్తవ యుగములో, దేవుడు యేసుక్రీస్తు ద్వారా, అనగా దేవుడు తన నిమిత్తము ప్రత్యేకముగా ఏర్పరచుకొనిన అధికార పూర్వక ప్రతినిధియైన వాని ద్వారా, మానవులమైన మనతో మాటలాడుచున్నాడు.[9]

**ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను; ఈయన మాట వినుడి!** అని పలుకుచుండిన దేవుని స్వరము **మేఘములో** నుండి ఉరుము వలె వినిపించినది. యేసు ఈ పర్వతముపై "తండ్రియైన దేవుని వలన ఘనతయు మహిమయు పొందెనని" పేతురు అటుతరువాత తన పత్రికలో రచించాడు. అది "మహా దివ్య మహిమయై" యుండినదని దేవుడు మేఘములో ప్రదర్శించిన ప్రత్యక్షతను అపొస్తలుడు

వర్ణించాడు (2 పేతురు 1:17). మోషే, ఏలీయా, మరియు యేసు సమానులై యుండలేదని తండ్రి చేసిన ఘోషణ బయలుపర్చినది. క్రీస్తు, దేవుని కుమారుడుగా, దైవమై యున్నాడు. ఏదిఏమైనా, ఈ ఘోషణ యేసు బాప్తిస్మము పొందిన సమయంలో దేవుడు పలికిన దానిని మించినదై యుండినది (3:17పై గల వ్యాఖ్యానము చూడు). "ఈయన మాట వినుడి!" అని ఈసారి అదనంగా పలికాడు. ఈ మందలింపు ముఖ్యముగా పేతురు విషయంలో, అనగా అంతకు మునుపు యేసు తన శ్రమానుభవముల గూర్చి ముందుగా తెలియజెప్పినప్పుడు (16:21–23) ఆయననే గద్దించుటకు ప్రయత్నించిన వాని విషయంలో, సముచితమైనదై యుండినది. యేసు, ఆయన మాటలను శ్రద్ధగా చెవినిబెట్టవలసిన అధికారపూర్వకమైన ప్రవక్తయై యున్నాడు (ద్వితీయోపదేశకాండము 18:15, 19; అపొస్తలుల కార్యములు 3:22, 23; 7:37). నేడు సహితము ఆయన మాత్రమే దేవుని ప్రతినిధియై యున్నాడు (హెబ్రీయులకు 1:1, 2). అంత్య దినమున, ప్రతి ఒక్కడు నిత్య తీర్పు పొందునట్లు "క్రీస్తు న్యాయపీఠము యెదుట ప్రత్యక్షము కావలసి యున్నది (2 కొరింథీయులకు 5:10).

**వచనము 6.** సంభ్రమాశ్చర్యమును గొలుపు దైవ సన్నిధి పేతురు యాకోబు, మరియు యోహానులలో ఒక సహజసిద్ధమైన ప్రతిస్పందనను పుట్టించినది **బోర్లబడి మిక్కిలి భయపడిరి.** ముఖమును నేలకానించి, ఒకరి యెదుట బోర్లబడుట, గొప్ప వినయమును మరియు మర్యాదను సూచించినది. ప్రజలు దేవునిని గాని ఆయన ప్రతినిధినిగాని ఎదుర్కొనినప్పుడు, వారు తరుచుగా ముఖమును నేలకానించి, సాగిలపడ్డారు (ఆదికాండము 17:3; లేవీయకాండము 9:24; యెహోషువా 5:14; న్యాయాధిపతులు 13:20; 1 రాజులు 18:39; యెహెజ్కేలు 1:28; 3:23, 24; 43:3; 44:4). ఈ ముగ్గురు శిష్యులు మిక్కిలి భయముతో సాష్టాంగ నమస్కారము చేసారు. అది ప్రమాదవశాత్తుననే జరిగినప్పటికి, వారు దేవుని మహిమను ముఖాముఖిగా చూచిన దాని ఫలితంగా వారు చచ్చిపోదురని వారనుకొని యుందురు (న్యాయాధిపతులు 6:22, 23; 13:20–22 చూడు).

**వచనముగా 7. యేసు వారి యొద్దకు వచ్చి వారిని ముట్టి, లెండి, భయపడకుడి అని చెప్పెను.** అయన తన శిష్యులను మొదట తాకుట ద్వారా (8:3, 15; 9:20, 25, 29; 14:36; 20:34 చూడు), అటుతరువాత ప్రోత్సాహకరమైన మాటలు పలుకుట ద్వారా (9:2, 22; 14:27; 28:10) ఆదరించాడు. ప్రకటన 1:17, 6వ మరియు 7వ వచనములకు ఒక సమానంతరముగా ప్రయోజనపడుచున్నది. యోహాను క్రీస్తు దర్శనమును చూచినప్పుడు, "చచ్చినవానివలె ఆయన పాదముల యొద్ద పడెను." దీనికి ప్రతిస్పందనగా, యేసు తన కుడిచేతిని యోహాను మీద ఉంచి అతడు భయపడవలసిన అవసరంలేదని యోహానుతో చెప్పాడు.

**వచనము 8.** యేసు వారికి అభయమిచ్చిన తరువాత, శిష్యులు వారు నేలమోపబడిన వారి ముఖములను పైకెత్తి **చూడగా యేసు తప్ప మరి ఎవరును వారికి కనబడలేదు.** గ్రీకు గ్రంథపాఠము, (NASB) ప్రతిబింబించుచున్నట్లుగా, యేసు తానొక్కడే ఉండినాడను వాస్తవమును ఉద్ఘాటించుటకు మాటలను పెద్ద కూర్పుగా అమర్చుచున్నది. దేవుని దైవికమైన సముఖమునకు చిహ్నముగా నిలిచియుండిన మేఘము పైకి లేచిపోయింది. మోషే మరియు ఏలీయా అదృశ్యమయ్యారు. శిష్యులు తమ కన్నులెత్తి చూచినప్పుడు యేసు తప్ప మరెవరును కనబడనందులకు వారికి గొప్ప ఊరట లభించినదనుటలో సందేహమేమియు లేదు.

## ఏలీయా గూర్చి శిష్యులడిగిన ప్రశ్న (17:9–13)

**[9]వారు కొండ దిగి వచ్చుచుండగా–మనుష్యకుమారుడు మృతులలోనుండిలేచువరకు ఈ దర్శనము మీరు ఎవరితోను చెప్పకుడని యేసు వారి కాజ్ఞాపించెను. [10]అప్పుడాయన శిష్యులు–ఈలాగైతే ఏలీయా ముందుగా రావలెనని శాస్త్రులెందుకు చెప్పుచున్నారని ఆయన నడిగిరి. [11]అందుకాయన–ఏలీయా వచ్చి సమస్తమును చక్క పెట్టునను మాట నిజమే; [12]అయినను ఏలీయా యిదివరకే వచ్చెను; వారతనిని ఎరుగక తమ కిష్టము వచ్చినట్టు అతనియెడల చేసిరి. మనుష్యకుమారుడు కూడ ఆలాగే వారిచేత శ్రమలు పొందబోవుచున్నాడని మీతో చెప్పుచున్నాననెను. [13]అప్పుడాయన బాప్తిస్మమిచ్చు యోహానును గూర్చి తమతో చెప్పెనని శిష్యులు గ్రహించిరి.**

**వచనము 9.** స్పష్టముగా, **యేసు** మరియు ఆ ముగ్గురు అపొస్తలులు ఆనాటి రాత్రి కొండ మీద గడిపారు, ఏలయనగా "మరునాడు వారు ఆ కొండ దిగి వచ్చిరని" లూకా 9:37 సెలవిచ్చుచున్నది. వారు కొండ దిగివచ్చుచుండగా, **మనుష్యకుమారుడు మృతులలో నుండి లేచువరకు ఈ దర్శనము మీరు ఎవరితోను చెప్పకుడని యేసు వారికాజ్ఞాపించెను.** ఆయన పాటించుచుండిన స్థిరమైన అభ్యాసం ప్రకారంగా, ఆశ్చర్యజనకమైన ఈ సంఘటన గూర్చి మరియు ఆయన క్రీస్తై యుండిన గుర్తింపు గూర్చి వారు ఎవరితోను ఏమియు మాట లాడకూడదని ప్రభువు వారికి ఆజ్ఞాపించాడు (8:4; 9:30; 12:16; 16:20 చూడు). రూపాంతరమును గూర్చిన ఎరుకను సవిస్తరంగా విస్తరింపజేయుటవలన యూదులలో అనేకులకు ప్రయోజనకరమై యుండదు, ఏలయనగ వారు ఒక ఇహలోక సంబంధమైన రాజ్యమును స్థాపించి దానిని పరిపాలించనై యుండిన ఒకసైనిక సంబంధియైన మెస్సీయా కొరకు ఎదురుచూచుచుండిరి. వారు, నిస్సందేహముగా, ఈ సంఘటన గూర్చిన తప్పుడర్థమును ప్రచురించుచుండినవారౌదురు. ఏదిఏమైనా, యేసుక్రీస్తు పునరుత్థానుడైన తరువాత, రూపాంతరమును గూర్చిన సాక్ష్యము అనేక సత్యములకు బలమైన పునాదియైనది: (1) యేసు యొక్క దైవత్వము, (2) సిలువపై మరణించుటకు ఆయన ఇష్టపడుట, (3) ఆయన పరలోక ఆధ్యాత్మిక పరిపాలన గూర్చిన వాస్తవము, మరియు (4) ఆయన రెండవ రాకడ గూర్చిన నిశ్చయత (2 పేతురు 1:16–18).

"దర్శనము" అను అర్థమిచ్చుచున్న గ్రీకు పదము (*horama*) రూపాంతరమును గూర్చిన యథార్థతను ఏమాత్రమును తగ్గించదు. ఈ పదము క్రొత్త నిబంధనలో అతి తరచుగా ఒక "దర్శనము" అను అర్థమిచ్చుచున్నప్పటికిని (అపొస్తలుల కార్యములు 9:10; 10:3; 11:5; 12:9; 16:9; 18:9). అది సామాన్యముగా "కంటికి కనబడిన విషయమును" సూచించును. ఇదే పదము అపొస్తలుల కార్యములు 7:31లో మండుచుండిన పొద గూర్చి చెప్పబడుచున్న సందర్భములో ప్రయోగింపబడినది, మోషే "ఆ దర్శనమునకు అశ్చర్యపడెనని" అచ్చట వ్రాయబడియున్నది (నిర్గమకాండము 3:3 చూడము). NIVలో అనువాదములో ఈ తొమ్మిదవ వచనము, "మీరు చూచిన విషయమును ఎవరతోను చెప్పవద్దు" అను అర్థము నిచ్చుచున్నది.

మరొక పర్యాయము, యేసు త్వరలో సంభవింపనై యుండిన ఆయన మరణ పునరుత్థానముల గూర్చి ప్రస్తావించుచుండెను (16:21 చూడు). ఏదిఏమైనా, ఆయన

మాటలు ఆయన పునరుత్థానమునే ఎక్కువ స్పష్టముగా సూచించుచున్నవి. ఆయన తన శిష్యుల మనోభావాలను తన శ్రమలు మరియు మరణము కంటె ఎక్కువగా ఆయన మరణముపై సాధించనైయుండినవి జయమువైపే మళ్లించుచుండెను.

**వచనము 10. శిష్యులు**, మోషే మరియు ఏలీయా వారికి కనబడిన సంఘటన యొక్క అర్థము గూర్చి యింకను ఖచ్చితంగా తెలియనివారై యుండినందువలన, **ఈలాగైతే ఏలీయా ముందుగా రావలెనని శాస్త్రులెందుకు చెప్పుచున్నారని? ఆయననడిగిరి.** శిష్యులడిగిన ప్రశ్న మలాకీ 4:5లో వ్రాయబడియున్న ప్రవచనమునకు సంబంధించినదై యుండినది: "ఇదిగో, యెహోవా నియమించిన భయంకరమైన ఆ మహాదినము రాకమునుపు నేను ప్రవక్తయగు ఏలీయాను మీ యొద్దకు పంపుదును." ఈ వాక్యము ఆధారంగా, ఏలీయా అక్షరాలా తిరిగి వచ్చునని శాస్త్రులు ఉపదేశించారు.[10] అలాగైతే, "ముందుగా" (మొదట) అని శిష్యులు పలికిన మాటప్రకారం, అది తీర్పు దినమునకు ముందు అని వారు భావించి యుండినట్టయితే, అందుకే వారు ఈ రూపాంతరము ఆ ప్రచనము యొక్క నెరవేర్పైయున్నదని ఆశ్చర్యపడి యుందురు. ఏలీయాకు "ముందు" (మొదట) మెస్సీయ వచ్చునని వారు ఉపదేశింపబడి యుందురనునది మరొక సాధ్యతయైయున్నది.[11] గనుక ఈ సందర్భములో, కొండ మీద ఏలీయా రాక ముందే యేసు ఎందుకు వచ్చాడో అని వారు తికమకపడ్డారు.

**వచనము 11.** యేసు తన శిష్యులను యింకను ధైర్యపర్చుచు, **ఏలీయా వచ్చి సమస్తమును చక్కపెట్టునను మాట నిజమే** అని చెప్పాడు. యేసు సూత్రప్రాయంగా శాస్త్రులతో ఏకీభవించుచున్నాడని ఆయన చేసిన వ్యాఖ్యానమునుబట్టి అర్థమగుచున్నది. ఏలీయా వచ్చి, "తండ్రుల హృదయములను పిల్లల తట్టును పిల్లల హృదయములను తండ్రుల తట్టును త్రిప్పునని" ప్రవక్తయైన మలాకీ పలికిన మాటల ధ్రువీకరణముగా కూడ అది ఉండినది (మలాకీ 4:6). "సమస్తమును" చక్కపెట్టుట అను మాటలు క్రైస్తవ యుగమును ప్రవేశపెట్టుటను సూచింపజాలవు, ఏలయనగా అట్టి అనువాదము మెస్సీయా మాత్రమే చేయగలదానిని ఏలీయా చేయుచున్నాడని చిత్రీకరించును. దానికి మారుగా, "సమస్తమును చక్కపెట్టును" అను మాటలు అతడు మెస్సీయ రాకడ కొరకు సిద్ధము చేయు పనులను సూచించుచున్నవి, మరియు ఈ పనుల ఫలితంగా ప్రజలు మారుమనస్సు నొందుచు, ఆధ్యాత్మికముగా పునర్ధరించబడుచుందురు.[12]

**వచనమ 12.** అటుతరువాత యేసు, **అయినను ఏలీయా యిదివరకే వచ్చెను, వారతనిని ఎరుగక, తమకిష్టము వచ్చినట్టు అతని యెడల చేసిరి** అని పలుకుచు ఏలీయాను గూర్చిన విషయమును స్పష్టము గావించాడు. సర్వసామాన్య సూత్రము యొక్క నిర్దిష్టమైన అన్వయింపు విషయంలో యేసు ప్రభువు శాస్త్రులతో ఏకీభవించలేదు. పాత నిబంధన ప్రవక్త పునః ప్రత్యక్షమగునని వారు ఎదురుచూచుచుండిరి (యోహాను 1:19, 21 చూడు), అయితే దేవుడు బాప్తిస్మమిచ్చు యోహానును "ఏలీయా యొక్క ఆత్మయు శక్తిగలవానిగా (క్రీస్తుకు) ముందు" పంపించాడు (లూకా 1:17). "ఏలీయా" (బాప్తిస్మమిచ్చు యోహాను) యిదివరకే వచ్చాడు, మారుమనస్సు నిమిత్తమైన పిలుపునిచ్చాడు కూడ, కానీ యూదా నాయకులు అతని పిలుపును నిరాకరించారు (3:7–10; 11:16–18; 21:25). బాప్తిస్మమిచ్చు యోహాను నీతిమంతుడై యుండినప్పటికిని, హేరోదు అతనిని పట్టి, చెరసాలలో వేసి చివరకు అతని తలగొట్టించాడు (14:3–12). ఆయన కూడ అదే విధముగా **శ్రమలు పొందబోవుచున్నాడని**

యేసు తెలియజేసాడు.

**వచనము 13.** యేసు యింత సవివరంగా వివరించిన తరువాత, **ఆయన బాప్తిస్మమిచ్చు యోహానును గూర్చి తమతో చెప్పెనని శిష్యులు గ్రహించిరి.** యేసు అంతకు మునుపు ఒకానొక సందర్భములో బాప్తిస్మమిచ్చు యోహాను యొక్క స్వభావము గూర్చి చర్చించినప్పుడు, "ఈ సంగతి నంగీకరించుటకు మీకు మనస్సుంటే, రాబోవు ఏలీయా యితడే" అని ప్రభువు సెలవిచ్చాడు (11:14). పేతురు, యాకోబు, మరియు యోహాను కొండ మీదనుండి దిగుచుండగా ఆ మాటలను గుర్తుకు తెచ్చుకొని యుందురు.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

## మనము దేవునికి చేయగల సేవ (అధ్యాయము 17)

1. *మనము దేవునికి చేయగల సేవలో అప్పుడప్పుడు ఆకాశమండలమందలి ప్రపంచము కలిసియుండగలదు* (17:1-13). యేసు కొండ మీద మహిమాన్వితము గావింపబడుట ఒక స్వర్గ లోక సంబంధమైన సంఘటనయై యుండినది. మనము యిటువంటి సన్నివేశములను అనుభవించకపోవచ్చును, కానీ దేవుని వాక్యమును ధ్యానించునప్పుడు స్వర్గ లోక సంబంధమైన ఆలోచనలు మనకు కలుగుచుండును. మన మనస్సులు పరలోకమందలి నిత్యజీవమును గూర్చిన ఆలోచనలతో నిండియండవలెను (2 కొరింథీయులకు 4:16-18; 5:1-7; 2 పేతురు 3:13).

2. *మనము దేవునికి చేయగల సేవలో భౌతికమైన, ఇహలోక ప్రపంచము కలిసియుండును* (17:14-23). ముగ్గురు అపొస్తలులు కొండ మీదనే నిలిచియుండలేదు. వారు తమ దివ్యానుభూతిని కొండ మీదనే విడిచిపెట్టి ఐహిక మహాప్రయాసము నిమిత్తము క్రిందికి దిగి రావలసి యుండినది. అదే విధముగా మనము ఈ లోకములో మన అనుదిన అవసరముల గూర్చి ఆలోచించుచుండవలెను. ఒక దేవాలయము గోడ మీది ఫలకముపై ఇలా వ్రాయబడియున్నది: "ఆరాధించుటకు లోనికి ప్రవేశించుడి. సేవ చేయుటకు బయటకు వెళ్లుడి."

3. *మనము దేవునికి చేయగల సేవలో చట్టబద్ధమైన, రాజకీయపరమైన ప్రపంచము కలిసియుండును* (17:24-27). ప్రభుత్వమునకు పన్ను చెల్లించుట గూర్చి యేసు బోధించాడంటే అది ఆయన ఉపదేశించిన యితర ఉపదేశములతోను తన సొంత మాదిరితోను పొంతనగలదైయుండినది (22:21). మనము మన పై అధికారులకు లోబడవలెనను ఇదే సూత్రమును పౌలు కూడ ప్రబోధించాడు (రోమీయులకు 13:1-7). క్రైస్తవులు పరిపాలించబడు ప్రభుత్వం మరియు రాజకీయ విధానములేవైనప్పటికిని వారు మంచి పౌరులై యుండుట వారి కర్తవ్యమై యున్నది. పౌలు తన పౌరసత్వమును ఎంతో ఘనమైనదానిగా పరిగణించుకొన్నాడు గనుక చట్టబద్ధమైన ఆయన హక్కుల కొరకు విన్నవించుకొన్నాడు (అపొస్తలుల కార్యములు 25:11).

## యేసు రూపాంతరము చెందుట (17:1-8)

యేసు రూపాంతరము మనకు నానావిధ అంశములకు సంబంధించినవి కనీసము

ఐదు వాస్తవములను బోధించుచున్నది.

1. *పాత నిబంధన త్వరలో కొట్టివేయబడి క్రొత్త నియమావళి ప్రవేశపెట్టబడనై యుండినది.* ధర్మశాస్త్రము "పాతగిలి ఉడిగిపోవుచు నివర్తనమగుటకు సిద్ధముగా నుండినది" (హెబ్రీయులకు 8:13). త్వరలోనే దాని స్థానములో ఒక నూతన నిబంధన, ప్రతి స్థలమందును చేరియున్న ప్రతి ఒక్క ప్రజాగుంపు చేరియుండు నిబంధన, ప్రవేశపెట్టబడనై యుండినది (హెబ్రీయులకు 8:7-12).

2. *మనము మరణించిన తరువాత కూడ ఉనికి కలిగి యుందుము.* ఈ విషయము రూపాంతర కొండ మీద మోషే మరియు ఏలీయా ఉపస్థితులై యుండుట ద్వారా తెలియజేయబడుచున్నది. మరణమనునది భౌతిక స్థితినుండి ఆధ్యాత్మిక స్థితిలోనికి ఏర్పడు మార్పునకు ఒక మధ్యస్థ స్థితియై యున్నది (ప్రసంగి 12:5). శరీరమునుండి మానవుని ఆత్మ వేరుచేయబడుటయే మరణము (ప్రసంగి 12:5; యాకోబు 2:26). మానవుని ఆత్మ దేవుని నుండి వేరగుటయే ఆధ్యాత్మిక మరణమై యున్నది (2 థెస్సలొనీకయులకు 1:9).

3. *మరణమందు మనము మన గుర్తింపును కోల్పోము.* పేతురు, యాకోబు, మరియు యోహాను, మోషేను మరియు ఏలీయాను ఎలా గుర్తించగలిగారో మనకు తెలియదు; కానీ మోషే, యింకను మోషేగానే, మరియు ఏలీయా, యింకను ఏలీయాగానే ఉండెనని మనము ఈ సంఘటన ద్వారా తెలిసికొనుచున్నాము. బిచ్చగాడై యుండిన లాజరు అబ్రాహాము రొమ్మున యింకను లాజరుగానే యుండెను, మరియు యాతనపడుచుండిన ధనవంతుడు యింకను ఆనాటి ధనవంతుడుగానే యుండెను (లూకా 16:19-31). ఆయన ఇహలోకములో ఎరిగియుండిన వారిని పరలోకములో కూడ తెలిసికొనవలెనని పౌలు ఆశించాడు (2 కొరింథీయులకు 4:14; 1 థెస్సలొనీకయులకు 2:19, 20). థెస్సలొనీకయ సంఘమును ప్రోత్సాహించుటకు పౌలు భవిష్యత్ గుర్తింపు భావనను ప్రయోగించాడు (1 థెస్సలొనీకయులకు 4:13-18).

4. *మన ఆరాధనా లక్ష్యం (object) క్రీస్తు.* మోషే మరియు ఏలీయా ఎంతో గొప్పవారైయుండినప్పటికిని, వారు యేసుకు సాటి కారు. ఎంతైనా, యేసు దైవికమైనవాడై యుండెను, వారైతే మానవులై యుండిరి. మనము ఆరాధించవలసినది వారిని కాదు, కానీ క్రీస్తును.

5. *నేడు సహితము క్రీస్తే దేవుని ప్రధాన ప్రతినిధియై యున్నాడు.* ఇశ్రాయేలీయులు వారికి వాగ్దానము చేయబడిన పాలు తేనెలు ప్రవహించు ప్రదేశము లోనికి ప్రవేశింపక మునుపు వారికి మోషే దేవుని ప్రధాన ప్రతినిధియైయుండెను (నిర్గమకాండము 3; 4); మరియు ఏలీయా, గొప్పమౌఖిక ప్రవక్తలలో ఒకడై యున్నాడని పరిగణింపబడినవాడు, యూదా మరియు ఇశ్రాయేలు దేశములకు దేవుని ప్రధాన ప్రతినిధియై యుండెను. మనము ప్రస్తుతము జీవించుచున్న ఈ యుగములో సహితము యేసే దేవుని ప్రధాన ప్రతినిధియై యున్నాడని రూపాంతర కొండమీద దేవుడుచేసిన ఘోషణ రుజువు చేయుచున్నది (17:5; హెబ్రీయులకు 1:1, 2). దేవుని పక్షమున మాటలాడుటకు కడవరి దినముల ప్రవక్తలలో ఏ ఒక్కనికైనను అధికారము లేదు మరియు కడవరి దినముల ప్రత్యక్షతలు ఈ రోజుల్లో ఏ మానవునికైనను ఇవ్వబడుటలేదు (యూదా 3).

## మరణమనగా నిర్గమము (17:3)

యేసు రుపాంతరము పొందుచుండగా, ఆయన మోషే మరియు ఏలీయాతో మాట లాడాడు. ఆయన యెరూషలేములో నెరవేర్చబోవుచుండిన "నిర్గమము" (*exodos*) వారి సంభాషణాంశమై యుండినదని లూకా 9:31 సెలవిచ్చుచున్నది. మరణము భౌతిక స్థితి నుండి ఆధ్యాత్మిక స్థితిలోనికి ఏర్పడు మార్పునకు ఒక మధ్యస్థ స్థితియైయున్నది (ప్రసంగి 12:5, 7; ఫిలప్పీయులకు 1:19–21). క్రైస్తవుల విషయంలోనైతే, మరణము ఏదో ఒక పూర్తిగా మరచిపోబడిన పరిస్థితి లోనికి వెళ్ళే ప్రయాణం కాదు. కానీ క్షయమగు ఐహికమైన శరీర బంధనము నుండి పరలోక సంబంధమైన ఇంటిలోని సుఖసంతోషానుభూతులను అనుభవించుటకు వెళ్లునట్లు లభించు ఒక విడుదలయైయున్నది (యోహాను 14:1–6; 2 కొరింథీయులకు 5:1–4). మోషే మరియు ఏలీయాయు యేసునకు చేసినది మాత్రమేగాక–అంతకు మించిన విషయములను యేసు మన కొరకు చేసాడు. మరణమును జయించి లేచుట ద్వారా, ఒకడు చనిపోయినను మరలా బ్రతుకుననియు, మరణము మనలను బంధించి యుంచజాలదనియు తెలియజెప్పు అభయమును యేసు మనకు అనుగ్రహించుచున్నాడు (1 కొరింథీయులకు 15:50–58). ఆయన మన చివరి శత్రువుపై విజయీభవుడయ్యాడు గనుక, మనము కూడ ఆ విజయములో పాలు పంచుకొనుచున్నాము (1 కొరింథీయులకు 15:25, 26).

## రాబోవువాడై యుండిన ఏలీయా (17:9–13)

"ఏలీయా ముందుగ రావలెనని" శాస్త్రులు ఎందుకు చెప్పారని శిష్యులు యేసు ప్రభువును ప్రశ్నించినప్పుడు (17:10), వారి ప్రశ్న కేవలము యూదా మత బోధకులకు సంబంధించిన సాంప్రదాయమును మించిన విషయముపై ఆధారపడి యుండినది. వారు ప్రవక్తయైన మలాకీ ద్వారా పలుకబడిన ప్రవచనము గూర్చి (మలాకీ 4:5, 6) ఆయనను ప్రశ్నించుచుండిరి.

అందుకు యేసు, "ఏలీయా యిదివరకే వచ్చెను, కాని వారతనిని గుర్తుపట్టలేదని" తన శిష్యులకు ప్రత్యుత్తరమిచ్చాడు (17:12). "ఆయన బాప్తిస్మమిచ్చు యోహానును గూర్చి తమతో చెప్పెనని శిష్యులు గ్రహించిరి" (17:13). బాప్తస్మమిచ్చు యోహాను రాబోవు ఏలీయాయై యుండెనని యేసు వారితో ఇదివరకు చెప్పియుండెను (11:14). అతని కుమారుడు "ఏలీయా యొక్క అత్మయు శక్తియు గలవాడై" వచ్చునని ఒక దేవదూత యోహాను తండ్రియైన జెకర్యాకు తెలియజెప్పాడు (లూకా 1:17). అలాగైతే, అతడు ఏలీయా కాదని యోహాను ఎందుకు చెప్పాడు (యోహాను 1:21)? నిస్సందేహముగా, యేసు యోహాను గూర్చి మాటలాడినప్పుడు అతడు ఏలీయా కాడని ఏ దృష్టికోణముతో చెప్పాడో, యోహాను, నేను ఏలీయానుకానని చెప్పినప్పుడు కూడ అతని మనస్సులో అదే దృష్టికోణముండినది. ఏలీయా ఏ స్ఫూర్తితో ప్రవచించాడో, యోహాను కూడ అదే స్ఫూర్తితో ప్రబోధించాడు, కానీ అతడు అక్షరాలా, తిరిగి మానవశరీరము దాల్చిన ఏలీయాయై యుండలేదు.

సూచనలు

[1]R. T. France, *The Gospel According to Matthew,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 262. [2]Josephus *Wars* 2.20.6; 4.1.8 చూడు. [3]"రపాంతరము పొందెను" అను అర్థమిచ్చు అంగ్ల పదము, లాటిన్ వల్గేట్ ప్రభావమునుబట్టి ఎంపికచేయబడినది (*transfiguratus est*). (Jack P. Lewis, *A Commentary on the Gospel According to Matthew*, Part 2, The Living Word Commentary [Austin, Tex.: Sweet Publishing Co., 1976], 44.) [4]Michael J. Wilkins, "Matthew," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke*, ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 106. [5]రెండవ వ్యక్తి, హనోకు (ఆదికాండము 5:24). [6]*Deuteronomy Rabbah* 3.17. అనేక రెఫరెన్సులు ఏలీయా తిరిగి వచ్చునని చెప్పుచున్నవి గనుక, మోషే తిరిగి వచ్చునని యూదుల ఎదురు చూపుకుగల నిదర్శనము బలహీనముగా నున్నది (11:14; 17:10–12పై గల వ్యాఖ్యానము చూడు). ఏలీయా తిరిగి వచ్చుటకు సంబంధించిన విస్తృతమైన లిఖితపూర్వక సాక్ష్యాధారాల కొరకు Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 439-40, n. 122 చూడము. [7]నిర్గమకాండము 13:21, 22; 16:10; 24:15–18; 40:34–38; సంఖ్యాకాండము 9:17; 11:25; ద్వితీయోపదేశకాండము 1:33; 5:22; 1 రాజులు 8:10–13 చూడు. [8]Robert H. Gundry, *Matthew: A Commentary on His Literary and Theological Art* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 344. [9]Donald A. Hagner, *Matthew 14-28*, Word Biblical Commentary, vol. 33B (Dallas: Word Books, 1995), 493 చూడు. [10]Sirach 48:10, 11; Mishnah *Eduyoth* 8.7; *Sotah* 9.15; *Baba Mesia* 3.4, 5; Talmud *Erubin* 43b. John Lightfoot, *A Commentary on the New Testament from the Talmud and Hebraica: Matthew-1 Corinthians*, vol. 2, *Matthew-Mark* (Oxford University Press, 1859; reprint, Grand Rapids, Mich.: Baker, 1979), 244-46.

[11]Justin Martyr *Dialogue with Trypho* 8; 49 చూడు. [12]Hagner, 499.